సాక్షి
పెద్దపల్లి
ఆదివారం, 7, మే, 2023



వయోవృద్ధుల పోర్టల్

పెద్దపల్లిరూరల్: వయోవృద్ధుల పోర్టల్‌ను ఆర్డీవో వెంకటమాధవరావు శనివారం ప్రారంభించారు. సీనియర్ సిటిజెన్స్ మెయింటనెన్స్ కేసులు ఫిర్యాదు చేయొచ్చన్నారు.



పర్మినెంట్ చేయండి

యైటింక్లయిన్‌కాలనీ:కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్ కోరారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0 /26.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రైతులు ఇబ్బందులు పడొద్దు



చెక్కు అందిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మారం: ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు ఇబ్బందులు పడకుండా కాంటాలు పెట్టాలని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణను ఆదేశించారు. మండలంలోని బొమ్మారెడ్డిపల్లికి చెందిన వెంకటేశ్ విద్యుత్‌షాక్‌తో మరణించగా మృతుడి భార్య చందుపట్ల మౌనికకు విద్యుత్‌నుంచి మంజూరైన రూ.5లక్షల చెక్కును శనివారం మండల పరిషత్‌లో అందించారు. ఈ సందర్భంగా మండలంలోని కొత్తపల్లి రైతులు మంత్రిని కలిసి ధాన్యం కొనుగోలు చేయాలని విన్నవించారు. స్పందించిన మంత్రి ఈశ్వర్ వెంటనే అదనపు కలెక్టర్‌కు ఫోన్ చేశారు. రైతులకు మిల్లర్ల నుంచి ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాంరెడ్డి, బొమ్మారెడ్డిపల్లి సర్పంచ్ గాగిరెడ్డి ప్రేమలత, ఎంపీడీవో జయశీల, విద్యుత్ ఏఈ ఖాసీం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాసూరి శ్రీధర్ పాల్గొన్నారు.

అభివృద్ధికి దిక్సూచిగా పారిశ్రామిక ప్రాంతం




మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: అభివృద్ధికి దిక్సూచిగా రామగుండం పారిశ్రామిక ప్రాంతం నిలుస్తోందని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. యువతకు ఉపాధి కల్పనకు ఇండస్ట్రియల్‌పార్క్, ఐటీపార్క్ మంజూరు చేయించుకున్నామన్నారు. ప్రజల కోరిక మేరకు సీనియర్ సివిల్‌జడ్జి కోర్టు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం మాంజూరు చేయించామన్నారు. ఇండస్ట్రియల్ పార్కు, ఐటీపార్కు శంకుస్థాపన, పోలీస్ కమిషనరేట్ ప్రారంభోత్సవానికి ఈనెల 8న మంత్రి కేటీఆర్ వస్తున్నారని, జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, నాయకులు మూల విజయారెడ్డి, జెడ్పీటీసీ అముల నారాయణ, పీటీస్వామి పాల్గొన్నారు.

సండే స్పెషల్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: చినిగిన చొక్కా అయినా తొడుక్కో.. మంచి పుస్తకం కొనుక్కో అన్నారు పెద్దలు. ఎందుకంటే పుస్తకం జీవిత ముఖచిత్రాన్ని మారుస్తుంది. విజ్ఞానాన్ని పంచడమే కాదు, జీవితంలో వెలుగు నింపి, పదిమంది జీవితాల్లోనూ వెలుగులు నింపేలా చేయగల ఏకైక సాధనం. అందుకే, ఎన్నో కష్టాలు పడి, వ్యయప్రయాసలకు ఓర్చి తమ పిల్లల కోసం పాఠ్యపుస్తకాలు సంపాదిస్తారు తల్లిదండ్రులు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు కాస్త అటూ ఇటుగా అయినా.. ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు ఉచితంగా సరఫరా చేస్తుంది. కానీ, ప్రైవేటు స్కూళ్లలో చదువుకునే విద్యార్థులకు పుస్తకాలు దొరకడం కొన్నిసార్లు కష్టమవుతుంది. పేద విద్యార్థులైతే సెకండ్‌హ్యాండ్‌లో అయినా సరే.. ఎంతోకొంత చెల్లించి చదువుకుంటారు. ప్రతీ విద్యార్థి ఎంతో విలువైన పాఠ్యపుస్తకాలే తన విజ్ఞానసంపత్తిగా పూజిస్తారు. ఒక్క విద్యార్థులకే కాదు, వివిధ సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులకు సైతం ఓ వెబ్‌సైట్ ఒక ఆన్‌లైన్ లైబ్రరీలా మారింది. అలాంటి విజ్ఞాన భాండాగారాలు ఆన్‌లైన్‌లో ఉచితంగా లభ్యమయ్యే వెబ్‌సైట్ గురించి సండే స్పెషల్...



సైబర్ సేఫ్టీ జాగ్రత్తలు




రోడ్డు భద్రత పాఠాలు



పదోతరగతి తెలుగు పీడీఎఫ్



సుమతి శతకం ఆడియోఫైల్ ముఖచిత్రం



గురుశిష్యుల కరదీపిక!

- ఎస్‌సీఈఆర్‌టీ తెలంగాణ వెబ్‌సైట్‌లో పాఠ్యపుస్తకాలు
- 1 నుంచి 10వ తరగతి వరకు ఇ- పుస్తకాలు
- ఏ సిలబస్ కావాలన్నా.. క్షణాల్లో డౌన్‌లోడ్
- ఎప్పటికప్పుడు విద్యా సమాచారం అప్‌డేట్
- అందుబాటులో శతక పద్యాల ఆడియో పుస్తకాలు
- ఉపాధ్యాయులు.. విద్యార్థులకు సమస్త సమాచారం

ఎస్‌సీఈఆర్‌టీ వెబ్‌సైట్‌లో

కాలంతోపాటు పుస్తకం ముఖచిత్రం, దాని తీరుతెన్నులూ మారాయి. ఒకప్పటిలా చేతిలో పట్టుకుని చదివేతేనే పుస్తకం కాదు, సెల్‌ఫోన్, ట్యాబ్, కంప్యూటర్ ఇలా ఎక్కడైనా, ఎప్పుడైనా చదువుకునేలా పాఠ్యపుస్తకాలు పీడీఎఫ్ ఫార్మాట్‌లోకి వచ్చేశాయి. అలా అని వీటికి ఎలాంటి రుసుము చెల్లించనక్కర్లేదు. ఎవరైనా ఉచితంగా చదువుకునేలా ఏర్పాటు చేశారు. https://scert.telangana.gov.in/(హెచ్‌టీటీపీఎస్://ఎస్‌సీఈఆర్‌టీ. టీఈఎల్ఏఎన్‌జీఏఎన్ఏ.జీవోవీ.ఐఎన్/ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం రూపొందించింది. వెబ్‌సైట్‌లో ఇ-టెక్ట్స్ బుక్ కాలంలో వెళ్లగానే 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూలతోపాటు గణితం, సైన్స్, సోషల్ పాఠ్యపుస్తకాలను పీడీఎఫ్ రూపంలో అందుబాటులో ఉంచింది. వీటిని ఎప్పుడైనా, ఎలాగైనా చదువుకోవచ్చు. కేవలం చదువుకోవడమే కాదు, కావాలిన్న పుస్తకం అందులో ఎంచుకున్న పాఠ్యాంశాన్ని పీడీఎఫ్ రూపంలోనూ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

- సాధారణంగా ఈ వెబ్‌సైట్ విద్యార్థులకే కాదు, ఉపాధ్యాయులకు సైతం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలో బోధించే టీచర్లంతా చాలా దూరం నుంచి స్కూళ్లకు వస్తుంటారు. అలాంటి వారంతా మార్గమధ్యలో తమ సెల్‌ఫోన్లలోనే ఈ వెబ్‌సైట్ ఓపెన్‌చేసి చెప్పాల్సిన సిలబస్‌ను ప్రిపేరవ్వడం, సాధన చేయడం, సమీక్షించుకోవడం వంటివి చేసుకునే వెసులుబాటు కలిగింది. ప్రయాణాల్లో ఉన్న విద్యార్థులు సైతం ఈ వెబ్‌సైట్ ఓపెన్ చేసుకుని పరీక్షలకు సిద్ధమవవచ్చు.
- అకడమిక్ క్యాలెండర్‌పైనా ఇక్కడ సమస్త సమాచారం ఉంది. సిలబస్‌తోపాటు పిల్లల పరీక్షల మూల్యాంకనం, పరీక్ష ప్రమాణాలు, రిజిష్టరు నిర్వహణ తదితర విషయంలో వృత్తిరీత్యా ఉపాధ్యాయులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. వీటితోపాటు ట్రెయినింగ్స్, టీచర్ ఎడ్యుకేషన్, టీసాట్ ప్రోగ్రాముల ప్రసారవేళలు, విద్యాశాఖ నిర్వహించే పలు రకాల కార్యక్రమాలు, అవార్డులు, సైన్స్ ప్రోగ్రాములు ఇలా అనేక రకాల ఉపయుక్తమైన సమాచారం టీచర్లకు అందజేస్తోంది.

శతక పద్యాల ఆడియో..

ఇ-టెక్ట్స్ బుక్ కాలంపైన శతక పద్యాల ఆడియో కాలం ఉంటుంది. దీన్ని ఎంచుకుంటే తెలుగులో ప్రముఖ కవులు రాసిన సుమతీ, వేమన, భాస్కర, కుమార, దాశరథీ, నరసింహ, శ్రీకాళ హస్తీశ్వర శతకాలు అందుబాటులో ఉన్నాయి. ఈ శతక పద్యాలన్నీ పీడీఎఫ్ రూపంలో అందమైన పత్ర విన్యాసంతో ఆకర్షణీయంగా పీడీఎఫ్ పేజీల్లో తీర్చిదిద్దారు. ఈ పద్యాలు కేవలం చదువుకోవడానికే కాదు, ఈపద్యాలను వినే సదుపాయం కూడా ఉంది. పేజీల అగ్రభాగంలో ఆడియోఫైల్ చిహ్నం ఉంటుంది. దాన్ని ప్లే చేస్తే.. పద్యంగానం చేసి, దాని తాత్పర్యం ఉన్న ఆడియో ఫైల్ వినిపిస్తుంది. పిల్లలతోపాటు, సమస్త ప్రజలను సన్మార్గంలో నడిపే ఈ శతక పద్యాలను డిజిటల్ రూపంలో పొందుపరిచిన విధానంపై ఉపాధ్యాయులు, విద్యార్థులు, తెలుగుపండితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జగిత్యాల జిల్లాకు ప్రాధాన్యం

జగిత్యాల జిల్లాకు చెందిన బద్దెన కవి రచించిన సుమతీ శతకంలోని ఎంపిక చేసిన పద్యాలు ఈ ఆడియో ఫైల్స్‌లో చోటు దక్కించుకున్నాయి. అదే జిల్లా నుంచి కటుకోజ్వల మనోహరాచారి నేతృత్వంలో నేరెళ్ల శ్రీరామకృష్ణశాస్త్రి సంగీతం అందించారు. ఇందులో కటుకోజ్వల మనోహరాచారి, నేరెళ్ల శ్రీరామకృష్ణశాస్త్రితోపాటు మాధవి ఈ పద్యాలను గానం చేశారు.

కెరీర్ గైడెన్స్ కూడా

- 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఏ కోర్సు ఎంచుకోవాలో వివరిస్తూ కెరీర్ గైడెన్స్ సంబంధించిన సమాచారం అందుబాటులో ఉంచింది.
- సీబీఎస్ఈ ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు వివిధ ఇంజనీరింగ్ కోర్సులు, కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, మెడికల్, కామర్స్, హిస్టరీ ఇలా అన్ని రంగాల్లో అగ్ర కోర్సులు వాటి ప్రాధాన్యాన్ని పరిచయం చేస్తుంది.
- రోడ్డు భద్రత: ఇందులో రోడ్డు భద్రతపై 1–10వ తరగతుల వరకు రోడ్డు భద్రత విద్య- ట్రాఫిక్ నిబంధనలు, జాగ్రత్తలపై పాఠాలు ఉన్నాయి.
- సైబర్ సేఫ్టీ: విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఏం చేయాలి? ఏం చేయకూడదో వివరించే జాగ్రత్తలను చిత్రరూపకంగా వివరించింది.
- వ్యక్తిగత భద్రత: పోలీసుశాఖ సహాయంతో ఆపదల్లో ఎలా వ్యవహరించాలి. ఇంట్లో, లిఫ్ట్‌ల్లో, నీటి వద్ద, అగ్నిప్రమాదాలు, వాహనాల వినియోగంపై పూర్తి అవగాహన కలగజేస్తుంది.
- ప్రపంచ తెలుగు మహాసభల వివరాలు, అందులో ప్రదర్శించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. బోధనలో టీచర్లకు ఉపయుక్తంగా ఉండేలా బీఈడీ పుస్తకాలు మొత్తం పీడీఎఫ్ ఫార్మాట్‌లో పెట్టారు.

సీఎం సూచనలతో..

సీఎం కేసీఆర్ సూచనల మేరకు విద్యాశాఖ మంత్రి సబితా సారథ్యంలో, విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శి చిత్రా రామచంద్రన్ సూచనలమేరకు తెలంగాణ రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణా సంస్థ సంచాలకులు శేషుకుమారి ఆధ్వర్యంలో ఈ ఆడియోఫైల్స్ రూపొందించారు. వీటిని జిల్లాల నుంచి ఎంపిక చేసిన ప్రముఖ పండితుల చేత పాడించడం గమనార్హం.

అమరుడైన భర్తకు భార్య సెల్యూట్

- తండ్రి చితికి నిప్పు పెట్టిన పెద్దకుమారుడు
- జనసందోహంతో కిక్కిరిసిన మల్కాపూర్
- నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు



అనిల్ అంత్యక్రియలకు తరలివచ్చిన జనం



సైనికుల గౌరవ వందనం



నివాళి అర్పిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

సైనికా.. సెలవిక..

బోయినపల్లి(చొప్పదండి): జమ్మూకాశ్మీర్‌లో జరిగిన ప్రమాదంలో చనిపోయిన అనిల్ అంతిమయాత్ర కుటుంబ సభ్యుల రోదనలు, బంధువులు, ప్రజాప్రతినిధుల ఆశ్రునయనాల మధ్య ముగిసింది. శనివారం ఉదయం అనిల్ భౌతికకాయం ఆయన స్వగ్రామమైన మల్కాపూర్‌లోని ఇంటికి చేరడంతో మండలవ్యాప్తంగా జనం భారీగా తరలివచ్చారు. ఆయన మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి గంగాధరకు చేరుకుంది. అక్కడ పలువురు యువకులు జాతీయ జెండాలతో స్వాగతం పలికి ర్యాలీగా మల్కాపూర్‌కు తీసుకెళ్లారు. అక్కడ ఆర్మీ అధికారులు సైనికలాంఛనాలతో గౌరవ వందనం చేశారు. అనంతరం అంతిమయాత్ర ప్రారంభించారు. అనిల్ వ్యవసాయ భూమిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆర్మీ సిబ్బంది గౌరవ వందనం చేసి గాల్లోకి కాల్పులు జరిపారు. అనిల్ పెద్ద కుమారుడు అయాన్ తండ్రి చితికి నిప్పంటించాడు.

నిన్ను విడిచి ఎలా ఉండాలే బావా..

అనిల్ భార్య సాజన్య రెండురోజులుగా కన్నీరుమున్నీరుగా విలపిస్తూనే ఉంది. 'బావా నిన్ను విడిచి నేనెలా ఉండాలే బావా.. పిల్లలను ఎట్ల సాదాలే బావా.. అని రోదించడం చూసేవారిని కంటతడి పెట్టించింది. 'నన్ను పోలీస్‌గా చూడాలని అంటివి. నీ మాటతోనే ఎస్సై పరీక్ష రాసిన బావ..' రెండు నెలలైతే దగ్గరికి బదిలీ చేయించుకుంట అంటివి.. అంతలోనే ఘోరం జరిగిందా బావా..' అంటూ భర్త ఫొటో ఉన్న ఫ్లెక్సీ వద్ద విలపించింది. అనిల్ తల్లి లక్ష్మి, అనారోగ్యంతో ఉన్న తండ్రి మల్లయ్య ఏడుస్తుండడాన్ని ఆపడం ఎవరితరమూ కాలేదు. కుమారులు అయాన్, అరయ్ సైతం తండ్రి శవపేటిక వద్ద విలపించారు.

అమరుడైన భర్తకు భార్య సెల్యూట్

అనిల్ భౌతికకాయాన్ని చితిపై పెట్టిన అనంతరం సైనికులు గౌరవ వందనం చేశారు. సైనిక గీతం ఆలపించిన సమయంలో అంతులేని దుఃఖంలోనూ సాజన్య భర్త భౌతిక కాయానికి సెల్యూట్ చేయడం అక్కడున్నవారిని మరింత కంటతడి పెట్టించింది. తండ్రి చితికి ఆయన పెద్ద కుమారుడు అయాన్ నిప్పు పెట్టాడు. అనిల్ సైనిక యూనిఫాంను ఆర్మీ అధికారులు సాజన్యకు అందించారు.

హాజరైన మంత్రి గంగుల, ఎంపీ సంజయ్

అనిల్‌కు మంత్రి గంగుల కమలాకర్, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, కలెక్టర్ అనురాగ్‌జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, ఏఎస్పీ తదితరులు నివాళులు అర్పించారు. అంత్యక్రియలు ముగిసేవరకూ అక్కడే ఉన్నారు. ఎమ్మెల్యే రవిశంకర్ అనిల్ పాడె మోశారు. అంతిమయాత్రలో అదనపు కలెక్టర్ భీమ్యానాయక్, వేములవాడ ఆర్డీఓ పవన్‌కుమార్, రాష్ట్ర నాయకులు జోగినిపల్లి రవీందర్‌రావు, ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, జెడ్పీటీసీలు కత్తెరపాక ఉమ, నాగం కుమార్, సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, సర్పంచు కోరెపు నరేశ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, సెస్ మాజీ చైర్మన్ అల్లాడి రమేశ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం, ఎంపీడీఓ నల్లా రాజేందర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. ఏఎస్పీ చంద్రయ్య, వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, బోయినపల్లి ఎస్సై మహేందర్ బందోబస్తు నిర్వహించారు.



అనిల్ సైనిక దుస్తులు చూసి విలపిస్తున్న భార్య సాజన్య



సాజన్యను చూస్తూ కంటతడి పెడుతున్న సంజయ్, శోభ



రోదిస్తున్న అనిల్ తల్లిదండ్రులు, బంధువులు

నలభై ఏళ్లలో జరగని అభివృద్ధి చేశాం

- జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు



శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

మంథని: నియోజకవర్గంలో ప్రజల చిరకాల స్వప్నాలు నెరవేర్చిన చరిత్ర తమదేనని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు పేర్కొన్నారు. నలభై ఏళ్లలో జరుగని అభివృద్ధిని తాను ఎమ్మెల్యేగా పనిచేసిన నాలుగేళ్లలోనే చేసి చూపించినట్లు తెలిపారు. మంథని మండలం ధర్మారం శివారులోని పోచమ్మవాగుపై రూ.1.85 కోట్లతో చేపట్టిన వంతెన పనులకు శనివారం శంకుస్థాపన చేసారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో తండ్రీకొడుకుల పాలనలో ఏ మాత్రం అభివృద్ధి జరుగలేదన్నారు. తండ్రి పేరు చెప్పుకొని కాలం వెల్లదీస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుకు కనువిప్పు కల్గేలా అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. కాంగ్రెస్ నాయకులకు అభివృద్ధి కనిపించడం లేదా.. అని ప్రశ్నించారు. మంథని ఎంపీపీ కొండ శంకర్, జెడ్పీటీసీ తగరం సుమలత పాల్గొన్నారు.

మూడు రోజుల్లో పట్టాలు పంపిణీ చేయండి



పెద్దపల్లిరూరల్: క్రమబద్ధీకరణ కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, మూడు రోజుల్లోగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని సీఎస్ శాంతికుమారి సూచించారు. హైదరాబాద్ నుంచి శనివారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లోనిఇ ధాన్యాన్ని త్వరగా తీసుకోవాలని, కేంద్రాల్లో వసతులు కల్పించాలని ఆదేశించారు. కంటివెలుగు, ఆరోగ్యమహిళ, సీఎమ్మార్, ధాన్యం కొనుగోలుకేంద్రాలు, ఇళ్లస్థలాల వివరాలను నమోదు చేయాలని సూచించారు.

ఆన్‌లైన్‌లో నమోదు : కలెక్టర్ సంగీత

ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ సంగీత జిల్లా అధికారులను ఆదేశించారు. 39 మంది డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఆధార్ వివరాల్లో సమస్యలున్నాయని, వారితో చర్చించి అప్‌డేట్ చేయాలని సూచించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో ఆర్డీవోలు వెంకటమాధవరావు, వీరబ్రహ్మాచారి, డీఆర్డీవో శ్రీధర్, డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, డీసీహెచ్‌ఎస్ శ్రీధర్, డీసీవో మైఖేల్‌బోస్, డీఏవో ఆదిరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి ఉన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డుకు నామినేషన్ల స్వీకరణ

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని విద్యార్థుల నుంచి ప్రస్తుత విద్యాసంవత్సరానికి ఇన్‌స్పైర్ అవార్డుల కోసం నామినేషన్లను ఆగస్టు 31వరకు ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి మాధవి తెలిపారు. పాఠశాల స్థాయి విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు కేంద్ర ప్రభుత్వం ఏటా ఇన్‌స్పైర్ అవార్డు మానక్ పోటీలను నిర్వహిస్తోందన్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు తమ వివరాలు, బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డుతోపాటు ప్రాజెక్టు వివరాలతో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావును 99515 04622లో సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

కోళ్లకు విషం.. స్టేషన్‌కు బాధితుడు



జూలపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట బాధితుడు

జూలపల్లి(పెద్దపల్లి): మండలంలోని అబ్బాపూర్ గ్రామానికి చెందిన జంగిలి మల్లయ్యకు చెందిన పెరటి కోళ్లకు శనివారం గుర్తు తెలియని వ్యక్తులు విషం పెట్టారు. ఆ విషం తిన్న 15కోళ్లు మృత్యువాత పడ్డాయి. దీంతో చనిపోయిన కోళ్లను తీసుకుని బాధితుడు నేరుగా పోలీసుస్టేషన్‌కు వచ్చాడు. తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశాడు. తన కోళ్లు చనిపోవడంతో రూ.5వేల నష్టం జరిగిందని మల్లయ్య వాపోయాడు. నిందితులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరాడు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ టీచర్ మృతి



సుధారాణి(ఫైల్)

ధర్మారం(ధర్మపురి): ధర్మారంలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్న కరాటి సుధారాణి(45) అనారోగ్యంతో చికిత్స పొందుతూ శనివారం మరణించింది. కొంతకాలంగా బీపీ, షుగర్‌తో బాధపడుతున్న సుధారాణి ఆరోగ్యం ఇటీవల క్షీణించింది.కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. బీపీ పెరగడంతో శనివారం చనిపోయిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆస్పత్రిలో వైద్యసేవలపై ఆరా



సిబ్బందితో మాట్లాడుతున్న కేంద్ర బృందం

సుల్తానాబాద్(పెద్దపల్లి): సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలపై రెండో రోజు శనివారం కేంద్ర బృందం ఆరా తీసింది. పరీక్షలు చేసిన తర్వాత రిపోర్టు ఎప్పుడు ఇస్తున్నారు, ఆస్పత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయా.. వంటి వివరాలు రోగుల నుంచి సేకరించారు. 70 శాతం కంటే ఎక్కువ మార్కులు వస్తే కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ సర్టిఫికెట్ అందజేస్తుందని హెచ్‌ఎం క్వాలిటీ మేనేజర్ అనిల్ తెలిపారు. ముస్కాన్‌కు ఎంపికై తే మూడేళ్లపాటు ఏటా రూ.3లక్షల చొప్పున నిధులు మంజూరవుతాయని తెలిపారు. కేంద్ర బృందం సభ్యులు యూనిస్, వందన ,షైనీ సాగర్, స్థానిక ఆస్పత్రి వైద్యులు రమాదేవి, తనూజ, శ్రీధర్ మహేందర్ ఉన్నారు.

భార్య మీద కోపంతో ఇంటికి నిప్పుపెట్టిన భర్త అరెస్టు

జ్యోతినగర్: భార్య మీద కోపంతో ఇంటికి నిప్పు పెట్టిన భర్తను అరెస్టు చేసినట్లు ఎన్టీపీసీ ఎస్సై జీవన్ తెలిపారు. ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధి క్రషర్‌నగర్‌లో నివాసముంటున్న లారీ యజమాని ఒర్సు రవీందర్, రహీమాను ప్రేమ వివాహం చేసుకున్నాడు. కొద్ది రోజులుగా ఇరువురి మధ్య గొడవలు జరుగుతున్నాయి. గత నెల 12న రహీమా ఇంటికి తాళం వేసుకుని గోదావరిఖనిలోని పుట్టింటికి వెళ్లింది. రవీందర్ తాళం పగలగొట్టి, ఇంట్లోని వస్తువులు కొన్ని బయటపడేయంతో పాటు పెట్రోలు పోసి నిప్పంటించాడు. స్థానికులు మంటలు ఆర్పి వేశారు. ఘటనపై రహీమా ఎన్టీపీసీ పోలీసులకు ఫిర్యాదు చేసిన క్రమంలో విచారణ అనంతరం రవీందర్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు.

మరో రెండు సోలార్ ప్లాంట్లు

- సాంప్రదాయ విద్యుత్‌పై సింగరేణి దృష్టి
- డిటేయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు సిద్ధం
- సంస్థ వ్యాప్తంగా మరో 13 ప్లాంట్ల నిర్మాణం
- బోర్డు ఆమోదం తర్వాత టెండర్ ప్రక్రియ



సోలార్ విద్యుత్ ప్లాంట్

గోదావరిఖని: సోలార్ విద్యుత్‌రంగంలో సింగరేణి తన వ్యాపార విస్తరణ చేపట్టింది. ఖాళీ ప్రాంతాల్లో సోలార్‌ప్లాంట్ల నిర్మాణానికి యాజమాన్యం చర్యలు తీసుకుంటోంది. సింగరేణి వ్యాప్తంగా మొదటి దశలో 300 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం పూర్తి చేయగా, రెండో దశ విస్తరణకు సిద్ధమైంది. రెండో దశలో సింగరేణి వ్యాప్తంగా 240 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్‌ప్లాంట్లను నిర్మించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. సింగరేణిలోని 9 ఏరియాల్లో ఖాళీ స్థలాలను గుర్తించారు. డిటేయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్) సిద్ధమైంది.

రెండు సోలార్ ప్లాంట్ల నిర్మాణం

సింగరేణి వ్యాప్తంగా 13 సోలార్ విద్యుత్‌ప్లాంట్ల నిర్మాణానికి నిర్ణయించగా.. రామగుండం రీజియన్‌లో రెండు ప్లాంట్ల నిర్మాణానికి డీపీఆర్ సిద్ధమైంది. ఆర్జీ–1 ఏరియాలో 15 మెగావాట్ల పాత పవర్‌హౌస్ ప్లాంట్‌లో 5 మెగావాట్ల ప్లాంట్, ఆర్జీ–3 ఏరియాలో రెండు చోట్ల 41 మెగావాట్ల విద్యుత్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని సంకల్పించారు. వీటితోపాటు సంస్థ వ్యాప్తంగా పలు సోలార్‌ప్లాంట్ల నిర్మాణానికి యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. వీటికి సంబంధించిన బడ్జెట్‌పై బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో గ్రీన్‌సిగ్నల్ లభిస్తే టెండర్ ప్రక్రియకు ముందుకెళ్లాలని చూస్తోంది.

తడిసిన ప్రతీ గింజను కొంటాం

- పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ఓదెల(పెద్దపల్లి): వరుసగా కురుస్తున్న వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. ఓదెల మండల పరిషత్‌లో శనివారం ఎంపీపీ కునారపు రేణుకదేవి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని రైతులు ఎప్పటికప్పుడు ఆరబెట్టాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఆందోళన పడొద్దన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యానికి పరిహారం వారం రోజుల్లో రైతుల ఖాతాల్లోకి జమవుతుందన్నారు. కొందరూ పనిగట్టుకొని రైతుల కల్లాల్లో తిరుగుతూ మాయమాటలు చెబుతున్నారన్నారు. ఓదెల ఆయుర్వేద హాస్పిటల్ కూలిపోయేందుకు సిద్ధంగా ఉందని, పక్కా భవనానికి నిధులు మంజూరు చేయాలని వైద్యురాలు కమలాకుమారి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. పొత్కపల్లి, కనగర్తి గ్రామాల సర్పంచులు, ఓదెల ఎంపీటీసీ ఆళ్ల రాజిరెడ్డి, కోట దామోదర్‌రెడ్డి, బొడకుంట లక్ష్మి మాట్లాడుతూ మిషన్‌భగీరథ పనులు ఇంకా పూర్తి కాలేదని మంచినీటి ఇబ్బందులు ఉన్నాయన్నారు. ఓదెల ఎంపీడీవో సత్తయ్య, తహసీల్దార్ రమేశ్, వైద్యులు మౌనిక, షాబొద్దీన్, ఏవో నాగార్జున, ఎంఈవో ఆరెపల్లి రాజన్న, ఏఈఈలు స్రవంతి, శివరాజన్, రాజమల్లయ్య, మోహన్‌సింగ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మ, ఉమా పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వంలోనే గ్రామాలాభివృద్ధి

సుల్తానాబాద్‌రూరల్: తెలంగాణ ప్రభుత్వంలోనే గ్రామాలు అభివృద్ధి బాటలో నడుస్తున్నాయని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. సుల్తానాబాద్ మండలం చిన్నకల్వలలో రూర్బన్ పథకం కింద రూ.40లక్షలతో బీటీరోడ్డు పనులు, ఎస్‌డీఎఫ్ రూ,10లక్షలతో సీసీ రోడ్లు, కల్వర్టు పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ రమేశ్‌గౌడ్, ఎంపీపీ బాలాజీరావు, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు అనంతరెడ్డి, ఎంపీటీసీ సంపత్‌గౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్, సింగిల్‌విండో చైర్మన్ సందీప్‌రావు, దయాకర్, భూమేశ్, రవి, సతీశ్ ఉన్నారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్ బాధితులకు న్యాయం చేయండి

- మంత్రి కేటీఆర్‌కు కాంగ్రెస్ నేత రాజ్‌ఠాకూర్ లేఖ

గోదావరిఖని: ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఉద్యోగాల పేరుతో మోసపోయిన బాధితులకు న్యాయం చేయాలని డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్ కోరారు. ఈనెల 8న రాష్ట్ర మంత్రి కేటీఆర్ రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో పర్యటిస్తున్న నేపథ్యంలో ఇక్కడి సమస్యలపై మంత్రికి బహిరంగలేఖ విడుదల చేశారు. ఉద్యోగాల పేరుతో ఆర్థికంగా మోసపోయిన కాంట్రాక్టు కార్మికుడు ముంజం హరీశ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. మోసపోయిన వారికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ ప్రాంతంలో 30వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని.. గతంలో ఇచ్చిన హామీ అయిన ఈఎస్‌ఐ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని కోరారు. పాలకుర్తి, అంతర్గాం మండలాలకు సాగునీటి కోసం లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేయాలన్నారు. రామగుండం జెన్‌కో ప్లాంట్‌ను విస్తరించాలని, బీపీఎల్ భూముల్లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.200 కోట్లు కేటాయించాలన్నారు. రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా)గా మార్చి స్మార్ట్‌సిటీగా ప్రకటించాలని కోరారు. మెడికల్ కాలేజీకి సింగరేణి మెడికల్ కళాశాలగా పేరు మార్చాలని, కార్మికుల పిల్లలకు సీట్లలో 50శాతం రిజర్వేషన్ ప్రకటించాలని లేఖలో కోరారు. సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి పట్టాలివ్వాలని కోరారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

- మంథని–కాటారం రోడ్డుపై బైఠాయింపు



ఎక్లాస్‌పూర్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

మంథని: వర్షానికి తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతూ మంథని మండలంలోని ఎక్లాస్‌పూర్ వద్ద శనివారం రైతులు ఆందోళనకు దిగారు. రైతులు మాట్లాడుతూ మంథని ప్రాంతంలో తడిసిన, మొలకెత్తిన ధాన్యం కొనడం లేదన్నారు. అకాల వర్షాలు కురుస్తున్నప్పటికీ కొనుగోలు కేంద్రాల్లో కనీసం టార్పాలిన్‌లు కూడా ఇవ్వడం లేదన్నారు. క్వింటాల్‌కు నాలుగు నుంచి ఐదు కిలోల తరుగు చేస్తామని రైస్‌మిల్లర్లు అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళన విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని సముదాయించిన వినలేదు. మంథని తహసీల్దార్ బండి ప్రకాశ్‌తో స్థానిక ప్రజాప్రతినిధులు ఫోన్‌లో మాట్లాడించగా.. ఆర్‌ఐ త్రివేణి ఆందోళన స్థలం వద్దకు చేరుకుంది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

జీజీహెచ్ కొత్త బ్లాకుల్లో మొదలైన వైద్యసేవలు



పేషెంట్లతో కిటకిటలాడుతున్న కొత్త ఓపీబ్లాక్

కోల్‌సిటీ: రామగుండం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లోని కొత్త బ్లాక్‌లో శనివారం నుంచి ఓపీ వైద్యసేవలను ప్రారంభించారు. రూ.6.5కోట్లతో జీజీహెచ్ ఆవరణలో 85 పడకల అదనపు భవనాన్ని నిర్మించగా.. శుక్రవారం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ప్రారంభించారు. కొత్త బ్లాక్‌తో కలిసి జీజీహెచ్ ఆస్పత్రి సామర్థ్యం 330 పడకలకు చేరింది. కొత్త బ్లాక్‌లోని ఓపీ విభాగాలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. 85 పడకల కొత్త బ్లాక్‌లో మెడికల్, ఆప్తమాలజీ, సర్జికల్, డెర్మటాలజీ, సైకియాట్రిక్, ఈఎన్‌టీ, పల్మనాలజీ ఓపీ విభాగాల్లో వైద్యసేవలందిస్తున్నారు. ఈ బ్లాక్‌లోనే ఫార్మసీ విభాగాన్ని కూడా కేటాయించారు. ఆక్సిజన్ సౌకర్యం ఏర్పాటుకు అంచనాలు రూపొందించి, ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్ తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో పిచ్చికుక్కలు.. ప్రయాణికుల పాట్లు



స్టేషన్ ప్రాంగణంలో పిచ్చి కుక్కలు

రామగుండం: ఇటీవల అన్ని ప్రాంతాల్లో వీధి కుక్కల బెడదతో పలువురు గాయాలపాలైన ఘటనలు చోటు చేసుకుంటున్న విషయం తెలిసిందే. రామగుండం రైల్వేస్టేషన్ ప్రాంగణంలోని రైల్వే ట్రాక్‌పై ప్రమాదవశాత్తు పడిపోయి మృతిచెందిన వివిధ రకాల జంతు కళేబరాలను కుక్కలు పీక్కుతింటున్నాయి. ఈ క్రమంలో వీధికుక్కలు పిచ్చిఎక్కి ప్లాట్‌ఫారంపై తిరుగుతూ ప్రయాణికులను వెంబడిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి స్టేషన్ ప్రాంగణంలోని రైల్వే ట్రాక్‌పై కళేబరాలు లేకుండా చూసి ప్లాట్‌ఫారంపై కుక్కలు తిరగకుండా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మిల్లుల్లో కోత పెడుతున్నారు

- రాష్ట్ర పౌరసరఫరాలసంస్థ చైర్మన్‌కు రైతుల ఫిర్యాదు
- అధికారులను మందలించిన రవీందర్‌సింగ్



ధాన్యం పరిశీలిస్తున్న రవీందర్‌సింగ్

పెద్దపల్లిరూరల్: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసి రోజులు గడుస్తున్నా తూకం వేయడంలో జాప్యం చేస్తున్నారన.. కొనుగోలు చేసిన ధాన్యంలో మిల్లర్లు కోతలు పెడుతున్నారని పలువురు రైతులు రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ రవీందర్‌సింగ్ దృష్టికి తెచ్చారు. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డులోని కొనుగోలు కేంద్రాన్ని శనివారం రవీందర్‌సింగ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలు విన్న రవీందర్‌సింగ్ అక్కడే ఉన్న అధికారులను మందలించారు. ధాన్యం తూకం వేసిన వెంటనే రశీదులివ్వకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైతులను ఆదుకోండి

- ముఖ్యమంత్రికి మంథని ఎమ్మెల్యే వినతి

మంథని: మంథని నియోజకవర్గంలోని పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని గ్రామాల్లో ఈదురు గాలులు, అకాల వర్షాల వల్ల అన్నదాతలకు అపారనష్టం వాటిల్లిందని నష్టాన్ని గుర్తించి తగిన పరిహారం అందించాలని మంథని ఎమ్మెల్యే డి. శ్రీధర్‌బాబు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మెయిల్ ద్వారా పంపిన వినతి పత్రంలో పేర్కొన్నారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం చెబుతున్నా.. కేంద్రాల నిర్వాహకులు, రైస్ మిల్లర్లు ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం వెంటనే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. భారీగా కురిసిన వర్షాలు, కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో కల్గిన నష్టంపై వ్యవసాయ అధికారులు సర్వేచేసినా, తమప్రాంత రైతులకు ఎలాంట నష్టపరిహారం అందలేదన్నారు. బ్యాక్ వాటర్ వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు. నియోజకవర్గంలో ఐదువేల ఎకరాలకు పైగా పంటలు నష్టపోయిన రైతులు, కౌలురైతులకు నష్టపరిహారం చెల్లించాలని ముఖ్యమంత్రిని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన ఆర్జీ–1 జీఎం



కలెక్టర్‌తో మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని: కలెక్టర్ సంగీత సత్యనారాయణను ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ శనివారం కలిశారు. జీడీకే–11వ గని పనుల పురోగతి, బొగ్గు ఉత్పత్తికి అంతరాయం లేకుండా చూసేందుకు చందనాపూర్ ఎస్సీకాలనీ ఖాళీ చేయించేలా చూడాలని కోరారు. అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ, మంథని ఆర్డీవో వీరాబ్రహ్మాచారి, ఏజెంట్ చిలక శ్రీనివాస్, ఎస్టేట్స్ మేనేజర్ బాలసుబ్రమణ్యం, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి తదితరులు ఉన్నారు.

ఐక్యతకు వేదిక ఈద్‌మిలాప్



ప్రత్యేక పార్థనలు చేస్తున్న ముస్లిం పెద్దలు

జ్యోతినగర్(రామగుండం): సమానత్వం, ఐక్యతలకు వేదిక ఈద్ మిలాప్ అని ముస్లిం మత పెద్ద మౌలానా ఖాజా అలీమొద్దీన్ పేర్కొన్నారు. ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని మజీద్ ఈ–నూరే–ముస్తఫా మజీద్ కమిటీ, ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఈద్–మిలాప్‌లో పాల్గొని మాట్లాడారు. ఎన్టీపీసీ రామగుండం ముస్లిం ఉద్యోగులు ముఖీద్, ఆసిఫ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో కోతలు పెట్టొద్దు

- మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి



ఫోన్‌లో మాట్లాడుతున్న గుజ్జుల రామకృష్ణారెడ్డి

పెద్దపల్లిరూరల్: వరిపంట సాగు చేసిన రైతులు ఇప్పటికే అనేక రకాలుగా నష్టపోయారని, వారు కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని భేషరతుగా కొనాలని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి కోరారు. మిల్లర్లు బస్తాకు నాలుగైదు కిలోలు అదనంగా తీసుకుంటున్నారని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల్లో సాగుతున్న ఈ దోపిడీని నియంత్రించాలంటూ అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణతో ఫోన్‌లో మాట్లాడారు. నాయకులు రాజు, సమ్మయ్య ఫహీం, స్వతంత్రకుమార్ ఉన్నారు.

అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు

పెద్దపల్లి మండలంలోని కొత్తపల్లి, హన్మంతునిపేట, తుర్కలమద్దికుంట గ్రామాలకు చెందిన రైతులు శనివారం అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణకు ధాన్యం కోతపై ఫిర్యాదు చేశారు. తేమ, మట్టి, తాలు ఉన్నాయంటూ బస్తాకు నాలుగైదు కిలోలు కోత విధిస్తున్నారంటూ నాయకులు ముత్యాల నరేశ్, రాజయ్య తదితరులు ఫిర్యాదు చేశారు.

హామీల అమలులో కేసీఆర్ సర్కార్ విఫలం

సీఎం కేసీఆర్ ప్రజలకు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు గుజ్జుల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. పెద్దపల్లిలో దీక్ష చేపట్టిన పంచాయతీ కార్యదర్శులకు శనివారం సంఘీభావం ప్రకటించారు. పంచాయతీ కార్యదర్శులకు ఇచ్చిన మాట ప్రకారం వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరారు. పిన్నింటి రాజు, పర్శ సమ్మయ్య, అక్కెపల్లి క్రాంతి, పల్లె సదానందం, ఫహీం, కుమార్, రవి, సంతోష్, రమేశ్, మల్లారెడ్డి ఉన్నారు.

వైభవంగా లక్ష్మీ నృసింహుడి రథోత్సవం



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మంత్రి ఈశ్వర్

ధర్మారం: ధర్మారం మండలం ఖిలావనపర్తి గ్రామంలోని శ్రీలక్ష్మినర్సింహస్వామి రథోత్సవ వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ హాజరుకాగా.. ఆలయ కమిటీ చైర్మన్ ఠాకూర్ హన్మాన్‌సింగ్ ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మంత్రి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. లయన్స్ క్లబ్ చైర్మన్ ఎలగందుల అశోక్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు అందించారు. ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు బలరాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, సర్పంచు సాగంటి తారకొండయ్య, ఎంపీటీసీ మోతె సుజాత, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి



కార్మికులతో మాట్లాడుతున్న ఆకుల వెంకన్న

కమాన్‌పూర్: సింగరేణిసంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న అన్నారు. శనివారం సెంటినరీకాలనీలో నిర్వహించిన సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ జనరల్ బాడీ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. గత ఎన్నికలకు ముందు టీఆర్‌ఎస్ ప్రభుత్వం సింగరేణి కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామని ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం 11వ పీఆర్‌సీని ప్రకటించి కాంట్రాక్టు కార్మికులకు అమలు చేయాలని అన్నారు. ఈ నెల 8న కోల్‌బెల్ట్ ఏరియాలో రాష్ట్ర మంత్రి కేటీఆర్ పర్యటించనున్న నేపథ్యంలో కాంట్రాక్టు కార్మికుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సుద్దాల మనోజ్, అశోక్, రజిత, లక్ష్మి, రాణి, రాజమ్మ, కోమల, పద్మలు పాల్గొన్నారు.

సీపీఆర్‌ఎంఎస్ ద్వారా ఉచిత వైద్యం అందించాలి

- బీఎంఎస్ నేత కొత్తకాపు లక్ష్మారెడ్డి



బలరాంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు సీపీఆర్‌ఎంఎస్ కార్డు ద్వారా ఉచిత వైద్యం అందించాలని బీఎంఎస్ నేత, కోల్‌సెక్టార్ ఇన్‌చార్జి కొత్తకాపు లక్ష్మారెడ్డి డైరెక్టర్(పా) బలరాంను కోరారు. హైదరాబాద్‌లోని సింగరేణిభవన్‌లో శనివారం కలిసి వినతిపత్రం అందించారు. మాజీ ఉద్యోగులు సింగరేణి ఆస్పత్రిలో వైద్యం చేయించకుంటే సీపీఆర్‌ఎంఎస్ కార్డుల నుంచి డెబిట్ చేస్తున్నారన్నారు. రిటైర్డ్ కార్మికులు పలు నగరాల్లో నివాసముంటున్నారని, వారికి అందుబాటులో మందులు ఉండేలా చూడాలని కోరారు. ప్రతి నెలా ఏరియా ఆస్పత్రులకు రావడం ఆర్థికభారంతోపాటు ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. అనువైన ప్రాంతాల్లో కంపెనీ అవుట్‌లెట్లను ఏర్పాటు చేయాలన్నారు. వైద్య ఖర్చులు యాజమాన్యం చెల్లించేలా చూడాలని కోరారు. కంపెనీ అధికారుల నుంచి రెఫరల్ లేకుండా మాజీ కార్మికులు నేరుగా రెఫరల్ ఆస్పత్రుల్లో చికిత్స పొందేలా చూడాలన్నారు. మండ రమాకాంత్, పవన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

రామగుండం పారిశ్రామిక ప్రాంతాన్ని‘బీ’ కేటగిరీగా మార్చాలి

- జిల్లా కాంట్రాక్టు కార్మికుల సంఘం ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్



మాట్లాడుతున్న చిలుక శంకర్

జ్యోతినగర్(రామగుండం): రామగుండం పారిశ్రామికప్రాంతాన్ని బీ కేటగిరీలోకి మార్చి కార్మికులకు న్యాయం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ అనుబంధ జిల్లా కాంట్రాక్టు కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్ అన్నారు. శనివారం ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌లోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ఈనెల 8వ తేదీన మంత్రి కేటీఆర్ రామగుండం ప్రాంతంలో పర్యటించనున్న క్రమంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం ఆయనకు వినతిపత్రం అందించేందుకు సమాయత్తమవుతున్నట్లు వెల్లడించారు. సింగరేణి, ఎన్టీపీసీ , పవర్ హౌజ్, కేశోరాం సిమెంట్, ఆర్‌ఎఫ్‌సీఎల్ కంపెనీలు ఉండటం వలన గత పది సంవత్సరాల క్రితం కార్పొరేషన్‌గా ప్రకటించడం జరిగిందన్నారు. ఎన్టీపీసీ సంస్థలో కాంట్రాక్టు కార్మికుడి వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. సమావేశంలో బుచ్చన్న, రాయమల్లు, రాజయ్య, వెంకటస్వామి, యాదగిరి, శివలాల్, సధానందం, రాజ కొమురయ్యలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్యాల సాధనపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న జీఎం మనోహర్

గోదావరిఖని(రామగుండం): వార్షిక నిర్దేశిత లక్ష్యాల సాధనపై దృష్టి సారించాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ కోరారు. శనివారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన ముఖ్య అధికారుల సమీక్షలో మాట్లాడారు. ముందుగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఓసీపీ–3, వకీల్‌పల్లిగని ఉత్పత్తికి సంబంధించిన విషయాలపై వివరించారు. యంత్రాల పనితీరు, విడిభాగాలు, పనిస్థలాలు తదితర అంశాలపై చర్చించారు. యంత్రాలను పూర్తి గంటలు వినియోగిస్తూ రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలన్నారు. ఉత్పత్తి లక్ష్యాల సాధన కోసం సమష్టిగా ముందుకు సాగినప్పుడే మంచి ఫలితాలొస్తాయన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సమావేశంలో ఎస్‌ఓటూ జీఎం అబ్దుల్‌సలీం, ప్రాజెక్టు అధికారి మధుసూదన్, గని ఏజెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఏరియా ఇంజినీర్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పట్టుకున్న రెండు ట్రాక్టర్లు

జ్యోతినగర్: ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను సాండ్ రీచ్ అధికారి సాయి కిరణ్ పట్టుకున్నారు. ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు రోడ్డు, అన్నపూర్ణకాలనీలోని చిలుకలయ్య గుడి ఏరియాలో నంబర్‌ప్లేట్ లేకుండా ఇసుక అక్రమరవాణాకు పాల్పడుతన్నట్లు అందిన సమాచారంతో సాండ్ రీచ్ అధికారి సాయికిరణ్ తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా.. అంతర్గాం మండలంలోని గోదావరినది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రి సమయాల్లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారు. ఈ క్రమంలో ఇసుక అక్రమ రవాణాతో పాటు, నంబర్ ప్లేట్ లేని వాహనాలపై రామగుండం రవాణాశాఖ అధికారులు నిఘా పెంచారు.